AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

2-10-2026 (Friday) MAIN EDITION

షుగర్ వ్యాపారులకు బిగ్ షాక్..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: దేశంలో చక్కెర ధరలు పెరగకుండా, కృత్రిమ కొరత లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులకు సంబంధించిన స్టాక్ హోల్డింగ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్టోబర్ 15, 2026 నుంచి నవంబర్ 30, 2026 వరకు ఈ కొత్త నిబంధనలు అమల్లో ఉండనున్నాయి. సాధారణ ప్రాంతాల్లోని చక్కెర డీలర్లు ఒకేసారి గరిష్ఠంగా 1,000 క్వింటాళ్ల స్టాక్‌ను మాత్రమే నిల్వ ఉంచుకోవాలి. డీలర్‌కు చక్కెర నిల్వ చేరిన తేదీ నుంచి 15 రోజుల్లోపు ఆ స్టాక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయాలి. అంటే 15 రోజులకు మించి నిల్వ ఉంచడానికి వీలులేదు.

కేఎల్ యూనివర్సిటీలో భారీ అగ్నిప్రమాదం



అక్షరటుడే, ఏపీ : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ప్రముఖ కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గురువారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. వర్సిటీ భవనంలోని ఐదో అంతస్తులో ఉన్న సెంట్రల్ లైబ్రరీలో ఒక్కసారిగా మంటలు భారీ ఎత్తున ఎగిసిపడ్డాయి. క్షణాల్లోనే మంటలు లైబ్రరీ అంతటా వేగంగా వ్యాపించడంతో.. లోపల ఉన్న వేలాది పుస్తకాలు, విలువైన ఫర్నిచర్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

మహారాష్ట్రలో విషాదం



అక్షరటుడే, మహారాష్ట్ర: మహారాష్ట్రలో విషాదం చోటు చేసుకుంది. ట్రక్కు-బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో 19మందికి గాయపడ్డారు. షెగావ్ నుంచి దుర్గాదేవి విగ్రహాన్ని తీసుకెళ్తుండగా అమరావతి జిల్లా ధమన్‌గావ్‌లోని సమృద్ధి మహామార్గ్‌పై ఈ ప్రమాదం జరిగింది.

కండక్టర్‌గా మారిన సీఎం విజయ్



అక్షరటుడే, తమిళనాడు : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బస్సులో ప్రయాణికులకు స్వయంగా టికెట్లు జారీ చేశారు. తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఆర్డినరీ బస్సులకే పరిమితమైన దానిని తాజాగా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులకు విస్తరించారు.

ఫోన్ రీచార్జ్ చేసుకుంటే బీమా



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బీఎస్ఎన్ఎల్ వినూత్న ఆఫర్‌తో వచ్చింది. ప్రీపెయిడ్ ప్లాన్‌ను రీచార్జ్ చేసుకోవడం ద్వారా కాలింగ్, మొబైల్ డేటాతో పాటు ఇన్సూరెన్స్ కవరేజీని అందించే ప్లాన్లను ప్రకటించింది. ఎస్టీవీ 202, ఎస్టీవీ 2449 ప్లాన్లపై ప్రమాద బీమా సదుపాయం కల్పించింది.

పైలట్ స్మిత్ మచ్చర్‌తో ఫోన్లో మాట్లాడిన మోదీ



అక్షరటుడే, ఢిల్లీ : పై దుబాయి ఫ్లైట్‌లో తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను కాపాడిన పైలట్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉదయం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం ఆయన అబుదాబి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎన్నో ప్రాణాలను కాపాడటంలో కెప్టెన్ చూపిన ధైర్యాన్ని ప్రధానమంత్రి ప్రశంసించి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఆ కఠిన సమయంలో తాను హనుమాన్ చాలీసా పఠించానని మచ్చర్ చెప్పారు. హనుమంతుడే తనకు ధైర్యాన్నిచ్చాడు అని పేర్కొన్నారు.

మహాత్ముడికి నివాళులర్పించిన గవర్నర్, సీఎం రేవంత్



అక్షరటుడే, హైదరాబాద్: మహాత్మా గాంధీ జయంతి వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ప్రముఖులు మహాత్ముడికి నివాళులర్పించారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాపూఘాట్‌ను సందర్శించి గాంధీజీకి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయిన రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొంది. తుది జాబితాలో ఎవరైనా అర్హులు ఓటు హక్కు కోల్పోతే తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. కొత్త ఓటర్లతో పాటు వీరి దరఖాస్తులను సైతం స్వీకరించాలని ఆదేశించింది.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్



ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్..

- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాల్లో అమలు

ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. ఎస్ఐఆర్‌తో లక్షలాది ఓట్లు తొలగించారు. మరణించిన వారితో పాటు డబుల్ ఓట్లు, సరైన పత్రాలు లేనివారి ఓటు హక్కును తొలగించారు. ఈ క్రమంలో పలువురు అర్హుల ఓట్లు కూడా తొలగించారని విపక్షాలు విమర్శిస్తున్నారు. దీంతో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాబితాలో చోటు దక్కని అర్హులైన ఓటర్లతో పాటు యువకులు, మొదటిసారి ఓటు వేయనున్న వారిని నమోదు చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించింది.

13 కోట్ల పేర్లు తొలగింపు

ఎస్ఐఆర్‌తో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13 కోట్ల పేర్లను తొలగించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈసీ తాజా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. అయితే జాబితా నుంచి తొలగించిన వారు అందరూ అర్హులు కాదని ఈసీ స్పష్టం చేసింది. అర్హులకు అన్యాయం జరగకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొంది. అన్ని అర్హతలు ఉన్నా ఎస్ఐఆర్ జాబితాలో పేరు రాకపోతే నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ కింద తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చడానికి సంబంధిత ఈఆర్‌వోలకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అన్ని అర్హతలు ఉన్నా.. ఓటు హక్కు కోల్పోయిన వారికి ఊరట దక్కనుంది.




ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

అక్షరటుడే, యూపీ : ఉత్తర్ ప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గోరఖ్‌పూర్ లింక్ ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బీహార్ నుంచి వస్తున్న వోల్వో బస్సు, ఒక ట్రైలర్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు.

సీజేపీ ఆందోళన.. ఢిల్లీలో ఇంటర్నెట్ బంద్

అక్షరటుడే, ఢిల్లీ : ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడుతామని సీజేపీ తెలిపింది. సీజేపీ పిలుపుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ధర్నా చౌక్ వద్ద భారీగా మోహరించారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. భద్రతా కారణాలతో 11 మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు మూసివేశారు. జంతర్ మంతర్, కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.





మోదీ ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఏళ్లుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ యుద్ధం ఆపాలని ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు ఇరుదేశాలకు సూచించారు. ఈ మేరకు యుద్ధం ఆపడానికి మోదీ చేస్తున్న ప్రయత్నాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. శాంతియుతమైన, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పుతిన్ అన్నారు. భారత్‌తో తమకు సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ, మోదీ ఈ సంఘర్షణను ముగించే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారని చెప్పారు. శాంతి ప్రయత్నాలు చేస్తున్న మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

లవ్లీనా పసిడి పంచ్..

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ సంచలనం సృష్టించింది. ఫైనల్‌లో ఘన విజయం సాధించి పసిడి పతకం గెలుచుకుంది. చైనాకు చెందిన బావో జియిను ఓడించిన లవ్లీనా గోల్డ్ మెడల్ సాధించింది. మహిళల డింగీ సెయిలింగ్ విభాగంలో భారత్‌కు చెందిన నేత్ర కుమనన్ కాంస్య పతకం గెలుచుకుంది. పతకాలు గెలిచిన క్రీడాకారులను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అభినందించారు.



ఆర్చరీలో మరో బంగారు పతకం

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో భాగంగా ఆర్చరీలో భారత క్రీడాకారులు అదరగొడుతున్నారు. ఇప్పటికే కాంపౌండ్ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించిన భారత్ తాజాగా రికర్వ్ విభాగంలో ఓ స్వర్ణం, ఓ రజతం గెలుచుకుంది. అంకితా భకత్, కీర్తి, కుంకుమ్ మొహోద్‌తో కూడిన జట్టు శుక్రవారం దక్షిణ కొరియాను ఓడించి పసిడి గెలుచుకుంది. దశాబ్దాలుగా ప్రధాన ఫైనల్స్‌లో ఏ జట్టు చేతిలోనూ ఓడిపోని సౌత్ కొరియాను తాజాగా భారత్ ఓడించింది.



కల్యాణలక్ష్మిపై ప్రభుత్వం నిర్లక్ష్యం : హరీశ్‌రావు

అక్షరటుడే, హైదరాబాద్ : కల్యాణలక్ష్మి పథకం లక్షలాది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగు నింపిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ పథకంతో బాల్య వివాహాలు తగ్గాయన్నారు. పథకం ప్రారంభించి 12 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఆయన ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెళ్లిళ్లు అయిపోయి.. పిల్లలు పుట్టినా.. కల్యాణలక్ష్మి డబ్బులు అందడం లేదని విమర్శించారు.

